**సావిత్రమ్మ కళ్ళున్నమ్మ లేక పోయింది. అనుమానం వొచ్చి పరిశీలనగా చూసింది. అనుమానం ఏమీలేదు. ఇంకా ఎంతసేపు చూడాలి? చూసినంతసేపూ అదేకదా కనబడుతుంది. మరొకటి కనబడదు గదా!**

సావిత్రమ్మకు యింట్లో పెద్ద పనేం లేదు. ఆమె మొగుడు యిప్పుడే చద్దన్నం తిని పొలంకాడికి పోయాడు. ఆయన మధ్యాహ్నం తిండికి గానీ తిరిగి రాడు. ఇంక మూడు గంటలకు పొయ్యిమీద అంత ఎసరు పెట్టి అన్నం చేసేస్తే సావిత్రమ్మను అడిగేవాడెవడూ వుండడు.

ఇప్పుడు టయం పుదయం ఏడున్నరే.

సావిత్రమ్మ తీరిగ్గా వీధివారగా వున్న అరుగు మీద కూర్చుని యిందాక చూసిందే చూడసాగింది.

వీధిలో వెంట్రుకల్ని విరబోసుకుని తలారబెట్టుకుంటూ వుంది సుకన్య. సావిత్రమ్మ కళ్ళకి—సుకన్య వీధిలో తలారబెట్టుకుంటున్నట్టు అగుపిస్తోందే గానీ, ఆ పిల్ల గడప ముందర వుంది. గడప ముందర వున్న సుకన్య పాపం వెంట్రుకల్ని విరబోసుకుని కూడా లేదు. మెడ మీద నించి యిటో పాయ, అటో పాయ ఎదమీద వేసుకుని కుదురుగా జుత్తులోకి వ్రేళ్ళని పోనించి లేతెండకి ఆరబెట్టు కుంటోంది.

వెంట్రుకలున్నమ్మ ఎంత కొప్పు అయినా వేసుకుంటుంది. తలంటుకున్నమ్మ ఏ రకంగానైనా ఆరబెట్టుకుంటుంది. ఎట్లా ఆరబెట్టుకుంటే మాత్రం సావిత్రమ్మ సొమ్ము పోయేదేం వుంది? కాబట్టి సుకన్య తలారబెట్టు కోవడంలో ఎటువంటి అభ్యంతరమూ, ఆశ్చర్యమూ లేదు, సావిత్రమ్మకు.

సావిత్రమ్మ అసలు వీధిలోకి చీటికీ మాటికీ వొచ్చేరకం గాదు. వీధిన ఎవడో ఫ్యాంటూ షర్టూ వేసుకుని బడాయి చూపిస్తూ పోతూవుంటే ఎవరో చూద్దామని లేచి వచ్చి తొంగి చూసింది.

అంతే!

సావిత్రమ్మ కళ్ళున్నమ్మ లేక పోయింది. అనుమానం వొచ్చి పరిశీలనగా చూసింది.

సుకన్య తల తడితడిగానే వుంది. పెరట్లో నుంచి స్నానం చేసివచ్చిన దాని మాదిరే వుంది. అంతెందుకు—పెట్టెలో నుంచి చలవ చేసిన నీలిరంగు పావడా, తెల్ల రవికా వేసుకుని వుంది. రోజుకొక పావడా, రవిక విప్పి పారెయ్యడానికి సుకన్య గొనీరు (గవర్నరు) కూతురేం గాదు. అది గంపెడు పిల్లల మధ్య ఒక బోడిపిల్ల. ఈ సంగతులు సావిత్రమ్మకు తెలుసు. సావిత్రమ్మ పరాయి వూరిది కాదుగదా. అదే వూరు, పైగా పక్కిల్లు. సుకన్య యింటి బండారం ఆమెకి తెలీనిదా?...

కాసేపు మాటవరసకు సుకన్య కలిగిన బిడ్డ అనే అనుకుందాం. రోజుకొక పావడా, రవికా విప్పుతుందనే అనుకుందాం. ఎంత కల్గిన వాళ్ళే అయినా రోజూ తలస్నానం చేస్తారా? లోకంలో సుకన్య ఒక్కతే కాదు ఆడపిల్ల. ఇంకా లక్షల మంది వున్నారు. వాళ్ళు శుక్రవారం పూట తెల్లారే తలంటు పోసుకుంటారు. ఇలా జరగడం సావిత్రమ్మ వూళ్ళోనే గాదు, అందరి వూళ్ళల్లోనూ—

అందువల్ల—

సావిత్రమ్మకే గాదు, లోకానికే విచిత్రంగా—సుకన్య మంగళవారం పూట తలంటుకుంది!!!


సావిత్రమ్మ మాట అబద్ధం అనుకుంటే ఆ వూళ్ళో—యింకా ఆడపిల్లలు వున్నారు గదా! వాళ్ళను చూద్దాం పదండి. వాళ్ళు తలకు నూనె పెట్టుకుని దువ్వుకుంటూ వుంటారు. సుకన్యలాగ తలంటుకుని ఎండకు ఆరబెట్టు కుంటూ వుండరు.

దీని వెనకాల నిజంగానే ఏదో వుంది. లేకుంటే పదమూడేళ్ళ ఒక ఆడపిల్ల మంగళవారం పూట తలంటుకోవడం ఏంది? దీని వెనక ఏదో వుండే వుంటుంది. ఏదో ఒక కారణం మాత్రం వుండకుండా వుండదు.

అరుగు మీద కూర్చునివున్న సావిత్రమ్మకి సుకన్యని అడిగేద్దామనే వుంది: "ఏవి, సుకన్యా...మంగళోరం పూట తలంటు కున్నావే..."

అయితే, దాంతో సావిత్రమ్మ మాట్లాడదు. అది...ఆ ముండ...చిన్నంతరం పెద్దతరం అని తలవదు. అటువంటప్పుడు దాంతో మాట్లాడితే మానంగా బతికే సావిత్రమ్మకు పరువు తక్కువ. అసలదే గాదు, దానమ్మ కూడా అంతే! జిల్లా లెవలు ఎస్పేరి (వ్యభిచారి). ఈ సుకన్ని గూడా తల్లి జుట్టులో దూరిపోయే ముండే. అంతేలే, విత్తొకటి వేస్తే చెట్టొకటి మొలుస్తుందా? లోకాన తల్లి చాలు బొల్లి(బుల్లి)పిల్ల — అనే సామెత వూరికినే పుట్టిందా?...

దాంతల్లి... అదే యీ సుకన్ని తల్లి... దానిపేరు చెప్పడానికిక్కూడా సావిత్రమ్మకు యిష్టం వుండదు. అది ఎవుతో గాదు. సావిత్రమ్మ తోడికోడలే. అదీ సావిత్రమ్మా ఒక అత్తకింద కోడళ్ళుగా వుండేటప్పుడు అది — యిట్ల వుండే పుల్లని అట్ల ఎత్తి వేసేది గాదు. అప్పుడు పనంతా — యింటి ముందర కళ్ళాపి చల్లింది మొదలు సర్వం—సావిత్రమ్మే చేసింది. అప్పుడంత కష్టం చేసే సావిత్రమ్మ బండెడు కండలూ—యెన్నపూస మాదిర— కరిగిపోయాయి. అయితే, కష్టం చేసినోళ్ళని దేవుడు చిన్నచూపు చూడడు. కండల్ని



# సుకన్య



— నాయిని సుబ్రహ్మణ్యం నాయుడు

మిగులబెట్టుకున్న ఆ ముండ యిప్పుడేం సుఖపడతా లేదు. పెద్దమనుషులైన యిద్దురాడపిల్లలకు పెండ్లిడ్లు చెయ్యకుండా ...చేసేదే, నీ కూతురునాక్కావాల—అని ఎవరైనా వచ్చి అడిగితే గదా పెండ్లిండ్లు చెయ్యడానికి! ధూ, అదీ దాని బతుకు—సాయిత్రమ్మకేం? ఒకే ఒక్క కూతురు. పెద్దమనిషైన మరసట్నెల్లోనే పెండ్లిచేసి పంపింది. పెండ్లి చేసేసి కూతుర్నే పంపిందా? వుహు అల్లుడికి అయిదువేలు డబ్బు, కుడిచేతికి వాసీ, యేలికి వుంగరం...అన్ని మర్యాదల్తోనే పంపింది. సుకన్ని తల్లికి ఎన్ని జెన్మాలెత్తినా సాయిత్రమ్మ అంతటి మంచి బతుకు రాదు.

ఆ యింటి మీద సాయిత్రమ్మకుండే కడుప్మంట కారణంగా ఆమె ఆ యింట్లో వాళ్ళతో ఎవర్తోనూ మాట్లాడదు.

సుకన్య తలారబెట్టుకోవడం అయిపోయినట్టుగా యింట్లోకి వెళ్ళిపోయింది. అదలా పోగానే దానమ్మ వచ్చి పిడికిట కుంకుడు గింజల్ని...తుక్కునీ వీధిలో విసిరింది. సాయిత్రమ్మ మాటని యిప్పుడైనా నమ్మారా? నిజమే—మంగళవారం పూట సుకన్య తలంటుకున్న మాట నమ్మి తీరవలసిందే.

కుంకుడుతొక్కు వీధిలోకి పారేసి వెళ్ళిపోయిందది. దాని మొగుడు సామ్ము ఏం పోయిందనో అది ముఖం మటమట లాడిస్తూ కనిపించింది సాయిత్రమ్మకు.

అదలా యింట్లోకి పోగానే దాని కూతుర్లు యిద్దరు వీధిలోకి వొచ్చారు. ఆ యిద్దరూ దున్నపోతుల్లా వున్నారు. ఆడపిల్లలకు వుండవలసిన నాజూకు వాళ్ళకి లేనేలేదు. ఆ యిద్దర్నీ కోస్తే రెండూళ్ళు హాయిగా మాంసం తినవచ్చు. వాళ్ళల్లో—ఒకదాని పేరు ఈశ్వరి. అది పెద్దది. దాని వొయిసిప్పుడు యిరవై ఏళ్ళు. అది పెద్దమనిషై ఎనిమిదేళ్ళయింది. ఆ మధ్య దానికొకడు వొచ్చాడు. వాడు ముసిలోడైతే కాదు గాని తలెంట్రుకలు నెరిసిపోయి వున్నాయి. వాడ్ని చూశాక సాయిత్రమ్మ కైతే నీళ్ళు తాగడం కూడా సయించలేదు. వాడు కూడా పదివేలు కట్నం అడిగినాడంట. పది సవరాల బంగారం పెట్టమన్నాడంట. దాంతో పెండ్లి జరగలేదు. రెండోదాని పేరు భారతి. దానికిప్పుడు పదారేళ్ళు. సమర్తై మూడేళ్ళయింది. పెద్దదానికే మొగుడు లేక చస్తావుంటే దీనికి యిప్పుడిప్పుడే ఎక్కడ కల్యాణం? ఇంక మూడోదే సుకన్య. సుకన్య

# తరంగాలు

దయ్యమనిన వెరపు తరుణిమీద వలపు
ముదురు మందు రాత్రి ముంచు కొలది
ఎంత రాత్రిగాని ఇంతి రమ్మన వింత
కాటి నడుమనైన కలియుగమున!

—కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

మీద యింకా సందేహం కలగటం లేదు సాయిత్రమ్మకు. అయితే, ఆమెకు—ఈశ్వరీ, భారతుల మీద పుల్లు డవుటు. వాళ్ళు సిగ్గాలజ్జా విడిచిపెట్టేసి వూరిమీద యీపాటికే పడే వుంటారు. అయినా యివన్నీ మాట్లాడి సాయిత్రమ్మ ఎందుకు పగగా అయిపోవాలి? నిజం నిప్పులాంటిది. వాళ్ళ బండారం యీరోజు గాకుంటే రేపయినా బయట పడకుండా పోదు.

ఈ ఈశ్వరీ భారతులు కూడా అదోమాదిరి, ఏదో జరగరానిది జరిగినట్టు—యింకేమీ చెయ్యలేక చింతిస్తున్నట్టున్నారు.

ఏదో జరిగింది...జరక్కుంటే అమ్మాబిడ్డ అంత రహస్యంగా వుంటారా? వాళ్ళు రహస్యంగా వుంటే వుండనీ—సుకన్య మంగళవారం పూట తలెందుకు అంటుకుంటుందీ?

సాయిత్రమ్మ మతిమరుపును పేడ చేత్తో తోసే చాటతో కొట్టినా పాపం లేదు. కాకుంటే, యిప్పుడా ఆ సంగతి గుర్తుకొచ్చేది!

సుకన్య పుట్టింది మంగళవారం. అవును, సుకన్య పుట్టింది ఖచ్చితంగా మంగళవారమే. ఆరోజు బాగా గుర్తు సాయిత్రమ్మకి. సాయిత్రమ్మ సుకన్య తల్లితో, "మంగళవారం కన్నావు. యింతటితో ఆగవు. మళ్ళీ మళ్ళీ కంటావు" అని కూడా అంది. సాయిత్రమ్మ మాట నిజంగా పొల్లు పోలేదు. ఆమె అన్న మాట అక్షలారా జరిగింది. సుకన్యకు యిప్పుడు ఒక చెల్లె, తమ్ముడు వున్నారు.

సుకన్య మంగళవారం పుట్టింది; దీనికి తిరుగులేదు. మంగళవారం పుట్టిన సుకన్య మంగళవారం తలంటుకోదు గదా? నిజంగా యిది మీకు విచిత్రం అనిపించలేదా? విస్మయం కలిగించలేదా? ఎవరైనా, యీ కలియుగంలో ఏ ఆడపిల్ల అయినా పుట్టినోజున తలంటు కుంటారా? శుక్రవారం వుండేదెందుకు? సాయిత్రమ్మ వూళ్ళో యిప్పటికి అలా జరగలేదు.

ఏం జరిగిపోయిందని కానీగానీ వారమైనా మంగళవారం పూట సుకన్య తలంటుకుంది?

సాయిత్రమ్మ సన్నమనిషి గాదు. మధ్యాహ్నం లోపల పసిగట్టే గలదు. సుకన్య మంగళవారం పూట ఎందుకు తలంటుకుందో తేల్చిగలదు.

సాయిత్రమ్మకు యింట్లోకి లేచి వ చ్చేద్దామని వుంది. తెల్లారి ఎండే అయినా ఒంటికి వేడిగా తగులుతోంది, ఆ అరుగు మీద కప్పేమీ లేక పోవడంతో.

ఇంతలోనే సుకన్య చేతిలో పుస్తకాలూ,టిఫెన్ కేరీరూ పట్టుకుని వీధిన బడి హైస్కూలుకు పోతూ వుంది.

తలంటుకున్న సుకన్య తల ఆరివుంది. ఒంటి జెడే వేసుకుంది. ఆ జెడ నాగుపావంత పొడుగుతో వికారంగా వుంది. ఎందుకంత జెడ? ముక్కూ ముఖం బాగుండాలి గానీ జెడ ఎంత వుంటే మాత్రం ఎందుకు? జెడతో కూర వొండు కుండామా?—


సాయిత్రమ్మ సుకన్య ముఖానికేసి గుచ్చిగుచ్చీ చూసింది. దాని ముఖం మబ్బుమబ్బు (చీకటి చీకటి)గా వుంది. ఇప్పుడో, యింకాసేపటికో వానకురిపించే ఆకాశం లాగ వుంది. అది వీధిలో నడుస్తూనే వున్నా అడివిలో నడుస్తున్నట్టుగా...ఒకాఒకటి ఒంటిగా నడుస్తున్నట్టుగా వుంది.

పోతోన్న కూతుర్ని దాంతల్లి గడపలో నుంచి దిగులు దిగులుగా చూస్తోంది. "సుకన్నా, సాయంకాలం తొందరగా యింటికి వొచ్చీ కూతరా!" అంది దాంతల్లి. తల్లితో మారుమాట్లాడకుండా, అలాగే తొందరగా వొచ్చేస్తానని చెప్పకుండా, కనీసం తిరిగైనా చూడకుండా అలిగినదాన్లా వెళ్ళిపోయింది సుకన్య. అలా వెళ్ళిపోయిన సుకన్యనీ, అది నడిచిన వీధినీ చూస్తూ గాఢంగా, పొడుగ్గా నిట్టూరుస్తూ దాంతల్లి యింట్లోకి పోయింది.

ఎందుకిట్లా?

తల్లీకూతురుకి ఏ కారణం వల్ల బెడిసింది? పోతున్న కూతుర్ని ఎందుకు తొంగి చూసింది? అయిస్కూలుకి సుకన్య పోవడం యీరోజేమైనా కొత్తా? మూడేళ్ళ నుంచీ తొంగి చూడంది యీరోజే ఎందుకు తొంగిచూసి సాయంకాలానికి తొందరగా రమ్మంటుంది? అది తిరిగైనా చూడకుండా అలిగినట్టుగా ఎందుకు వెళ్ళిపోతుంది?

మంగళవారం సుకన్య తలంటుకున్నదని ఒక్క సాయిత్రమ్మే గాదు అందరూ ఆశ్చర్యపడతారు. సుకన్య వీధమ్మట నడుస్తుంటే అమ్మలక్కలు నలుగురైనా అడిగే వుంటారు. సుకన్యతో చదువుకునే తోటి



ఆడపిల్లలు, "ఏవి, సుకన్నా, ఏవి యీరోజు...అదీ మంగళోరం పూట... తలంటుకున్నావు. ఏవి చెప్పు...నిజం చెప్పు...నీ మీద ఒట్టు—" అంటూ ఒత్తిఒత్తీ అడక్కపోతే సాయిత్రమ్మ పుట్టింది వాళ్ళ నాయినకే గాదు. మీరు సాయిత్రమ్మ మాట నమ్మకుంటే సుకన్యతో పాటు హైస్కూలుకు పొండి. సుకన్యని ఎంతమంది అడుగుతారో లెక్క వేసుకోండి. మీ వేళ్ళు మిగిలిపోయి, మీ వెంట్రుకల్ని మీరు లెక్క పెట్టుకోవలసిందే. అవును, ఒకరు గాదు, యిద్దరుగాదు, కోటి మంది అడుగతారు. అదేం విచిత్రం గాదు. రాత్రిపూట చద్దన్నం తినే మనిషిని అడుగుతుంది జెనం. అట్లాగే మంగళవారం పూట ఒక ఆడపిల్ల అయిన సుకన్య తలంటుకుంది గనక అడుగుతారు. తలంటుకోకుంటే అడుగుతారా?

అడిగిన వాళ్ళందరికీ సుకన్య ఏవని చెబుతుందో?

"వూరికినే తలంటుకున్నా. అందులో ఏవీ యిసేసం లేదు." అని జవాబు చెప్తుందేమో సుకన్య. జెనానికి ఆ జవాబు సరిపోతుందా? జెనానికి చెప్పలేక చెప్పలేక సుకన్య ప్రాణం సగంలో సగం చస్తుంది.

సాయిత్రమ్మ యింట్లోకొచ్చి వుడుకుడుగ్గా కాఫీ పెట్టుకుని తాగుతూ ఆలోచించింది: 'మంగళోరం ఎందుకు తలంటుకుందబ్బా సుకన్న?' అని.

సుకన్య కుటుంబమంటే కడుప్మంట వున్న యింకో యిద్దరాడోళ్ళతో కలిసి ఆలోచించాక అనుమానం తీరిపోయింది, సాయిత్రమ్మకు.

సాయిత్రమ్మకు అలాగని తొలినుంచీ తెలుసు. ఎప్పుడైతే, సుకన్య వీధిలో తలారబెట్టుకుంటూ వుండిందో అప్పుడే వూహించగలిగింది, సాయిత్రమ్మ అసలు విషయాన్ని.

*** *** ***

"యింత అన్యాయం బిడ్డలకెవరూ జెయ్యరు..." అంది సాయిత్రమ్మ మధ్యాహ్నం పూట మొగుడికి అన్నం పెడుతూ.

"ఏందే?" అర్థం కాక అడిగాడు సాయిత్రమ్మ మొగుడు.

"ఏ వాయిసుకా ముచ్చట వుండాలా, వొద్దా...". అనడిగింది సాయిత్రమ్మ.

వుండాలని గానీ వొద్దనిగానీ అనలేదు సాయిత్రమ్మ మొగుడు.




"బిడ్డల్ని సాకలేని తల్లీదండ్రీ, బిడ్డల ముద్దూముచ్చట తీర్చలేని తల్లీదండ్రీ నీళ్ళులేని బావుల్లో గుబిళ్ళుమని దూకి నడువులిరిగి సావడం మేలు..."అంది మళ్ళీ సాయిత్రమ్మ.

భార్య తన అన్ననీ, వొదిన్నీ తిడుతోందని సాయిత్రమ్మ మొగుడు అర్థం చేసుకున్నాడు.

"అవును. మనకూ నలుగురాడ పిల్లకాయలు పుట్టుంటే...మనబాగోతవూ తెలుసున్నూ." అన్నాడాయన.

"నలుగురు గాదు నలభై మంది ఆడపిల్లలు పుట్టేవుండినా—నేనా పిల్లలకు సీవంత లోటు జేసి వుండను. పెద్దమనుషులైన ఆడపిల్లల్ని ఏళ్ళుతరబడి యింట్లో పెట్టుకుని వుండను. పెద్దమనిషైన ఆడపిల్లను వారం రోజులు యింట్లోనే కూర్చోబెట్టి, తరువాత దానికి సాంగిం(సమర్త వేడుక) జరిపించి వుంటాను. అట్లగాకుండా, తెల్లారి పెద్దమనిషైన ఆడకూతురి నెత్తిన అన్ని నీళ్ళు పోసేసి యిస్కూలుకు పంపుతానా? వుహూ, నా ప్రాణం పోయినా అట్లా పంపను. ఊరి కండ్లల్లో దుమ్ముకొట్టి—అది పెద్దమనిషే కాలేదని నమ్మించి వుండను. ఎదిగిన పిల్లకాయల్ని ఎదగలేదని చెప్పను. ఎదిగీ ఎదగ్గానే వాళ్ళకు పైటలు (ఓణీలు) వేసి కళ్ళారా చూసుకుని వుంటాను. అంతేగాని, ఎదిగిన కూతుర్ని పెరట్లో కూచ్చోబెట్టి అన్ని నీళ్ళు నెత్తిన పోసేసి వెంటనే యిస్కూలికి పంపీను." అంది సాయిత్రమ్మ గర్వంగా. అనేసి తనకు అంతమంది మహాలక్ష్మల్లాంటి ఆడపిల్లలు పుట్టనందుకు నొచ్చుకుంది.


"నువ్వొక్కదానివేనా, తల్లీ? అందరు తల్లులూ బిడ్డలకు అన్నియిధాలా సవకూరుస్తారా..." అన్నాడు సాయిత్రమ్మ మొగుడు.

"నోరుముయ్, చాలుగాని." అని సాయిత్రమ్మ కసురుకుని, "అవును. నేనే తల్లిని. నా కూతురు పెద్దమనిషైనప్పుడు నేను వూరందరికీ తెలీపర్చిన, చాకలోడి ద్వారా. ముత్తయిదులంతా నా యింటికి వొచ్చినారు. తర్వాత వారం రోజులకు వేడిగ్గా సాంగిం జరిపించిన. ఏ లోటూ నా కూతురుకు చెయ్యలేదు. ఇప్పటికీ ఏళ్ళుతరబడి యిద్దరు ఎదిగిన కూతుళ్ళని యింట్లో పెట్టుకుని, యింకో కూతురు కూడా ఎదిగిందని తెలిసినాక— ఆ యిద్దరికీ జతవుతుందని భయపడి, ముగ్గురు ఎదిగిన కూతుళ్ళకి యింకా పెళ్ళి చేయలేదని నలుగురూ అంటారని వుచ్చలు పోసుకుని— దాని నెత్తిన అన్ని నీళ్ళుపోసి అయిస్కూలుకి పంపేవోళ్ళ మాదిర నేను నా కూతురికి అన్యాయం జెయ్యలా! ఆడపిల్లలకు పైటలంటే ఎంతిష్టం!!ముత్తయిదుల ముందర సాంగిం జరిపించుకుని, పూలజెడతో ఫోటో దిగాలని ఎంత కోరిక!! ఆ లోట్లు నా కూతురికి కలగనీలేదు నేను......"అంది. ఆమె గొంతు దెప్పుతున్నట్టుగా వుంది. ఆమె మగడికి అన్నం పెడుతూనే, దూరాన అడివిలోని మనిషితో మాట్లాడినట్టుగా గొంతు పెంచింది.

సాయిత్రమ్మ మళ్ళీ ఏదో అనబోతూ అనబోతూ ఆగిపోయింది.

పక్కింట్లోంచి రెండుమూడు కంఠాల ఏడుపులు. పుట్టబోతున్న ఎక్కిళ్ళని సమాళించుకోవడానికి చేసే ప్రయత్నం...

అర్థాంతరంగా అన్నంలో చేతులు కడిగేసుకుంటూ, "సుకన్ని సమర్తయిందా?" అనడిగాడు సాయిత్రమ్మ మొగుడు. సాయిత్రమ్మ మౌనం వహించింది. అవుననడానికి సాయిత్రమ్మ ఎవరు? తల్లీదండ్రీ కాదంటూ వుంటే... ... ... .




ఉచితం!
ఒక
ఆకర్షణీయమైన
ప్లాస్టిక్ కంటైనర్
6
సబ్బులతో
Super Power
Regal
Tough on dirt - Soft on clothes
Regal A Shaw Wallace Product
ACIL/0900/85-Tel
సూపర్ పవర్
రీగల్
మురికిని నిర్మూలిస్తుంది
బట్టలను కాపాడుతుంది
Shaw Wallace
షా వాలెస్ వారి
విశిష్ట ఉత్పాదన
ఈ సదుపాయం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం